

**ముంబై పాలిటిక్స్‌లో చారిత్రాత్మక పరిణామం..**


RNI NO.TELTEL/2023/87655

# దీక్ష ప్రభ

12-02-2026
గురువారం, హైదరాబాద్

తెలుగు దినపత్రిక

సంపుటి: 03 । సంచిక: 317
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.deekshaprabhadaily.com




తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ ప్రజాస్వామ్య పండుగ, సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థుల ఉత్కంఠ మధ్య కొనసాగింది. ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉత్సాహంగా తరలివచ్చారు. అయితే, ప్రశాంతంగా మొదలైన పోలింగ్ సమయం గడుస్తున్న కొద్దీ ఉద్రిక్తతలకు దారితీసింది.

## ముగిసిన తెలంగాణ మున్సిపల్ పోరు

### బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల జాతకాలు

- కరీంనగర్‌లో ఉద్రిక్తతలు.. పోలీసుల లాఠీచార్జికి నిరసనగా బీజేపీ ధర్నా
- దొంగ ఓట్ల బాగోతం బట్టబయలు
- 13న తేలనున్న 12,993 మంది అభ్యర్థుల భవిష్యత్తు

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ ప్రజాస్వామ్య పండుగ, సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థుల ఉత్కంఠ మధ్య కొనసాగింది. ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉత్సాహంగా తరలివచ్చారు. అయితే, ప్రశాంతంగా మొదలైన పోలింగ్

మిగతా2లో...

## రాష్ట్ర ఎన్నికల కమిషన్ అసలు ఉందా?

- రూపకల్పన చేసిన విధి విధానాలు అమలు చేస్తున్నారా?
- జనగణన నోటిఫికేషన్ తర్వాత కార్పొరేషన్ల ఏర్పాటు చట్టవిరుద్ధం
- నోటిఫికేషన్ ప్రకారం సరిహద్దులమార్పులు చేర్పులు 2027 మే వరకు చేయకూడదు
- మున్సిపల్ ఎన్నికలు జరుగుతుంటే అనేక మంది ఐఏఎస్‌లను బదిలీ చేశారు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, దీక్షప్రభ:** జనగణన నోటిఫికేషన్ వచ్చిన తర్వాత కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నోటిఫికేషన్ ప్రకారం సరిహద్దులకు సంబంధించి మార్పులు చేర్పులు 2027 మే వరకు చేయకూడదని ఉన్నప్పటికీ.. ఈ విధంగా చేయడం చట్టవిరుద్ధమన్నారు. మరోవైపు మున్సిపల్ ఎన్నికలు జరుగుతుంటే అనేక మంది ఐఏఎస్‌లను బదిలీ చేశారని మండిపడ్డారు.

మిగతా2లో...

## యాదృచ్ఛికంగా జరిగాయా?

### ఏదైనా వ్యవస్థీకృత ముఠా ఉందా?

- కిడ్నాపర్ల నుంచి రక్షించిన పిల్లలను ఇంటర్వ్యూ చేయాలి
- వాటి వెనుక ఎటువంటి ముఠాలు ఉన్నాయో తెలుసుకోవాలి
- చిన్నారుల మిస్సింగ్ కేసులు.. 'సుప్రీం' కీలక ఆదేశాలు



## నేనో.. పోలీసులో తేలిపోవాలి

- సంగారెడ్డిలో పోలీస్ వర్సెస్ జగ్గారెడ్డి
- సీఐ కాలర్ పట్టుకున్న అభ్యర్థి..
- రంగంలోకి దిగి రచ్చ చేసిన మాజీ ఎమ్మెల్యే



**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి, పోలీసుల మధ్య హైడ్రామా

మిగతా2లో...

## 'మాకు కాదు.. ముందు మీరే నేర్చుకోండి'

- ఏసీపీపై ఎంపీ అరవింద్ ఫైర్
- నిజామాబాద్‌లో రణరంగం
- కులపిచ్చిపై వ్యాఖ్యలు




**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల వేడి నిజామాబాద్‌లో తారాస్థాయికి చేరింది. పోలింగ్ కేంద్రాల వద్ద రాజకీయ నాయకులు, పోలీసుల మధ్య జరుగుతున్న పోరు ఓటర్లలో ఆసక్తి రేపుతోంది. బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ రంగంలోకి దిగడంతో వినాయక్ నగర్ పరిసర ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బూత్ నంబర్ 7 వద్ద విధుల్లో ఉన్న శంకర్ అనే కానిస్టేబుల్, ఒక మున్సిపల్ ఉద్యోగి కలిసి ఓటర్లను కాంగ్రెస్ వైపు మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ అరవింద్‌కు

మిగతా2లో...

## వ్యక్తిగత కక్షలు వద్దు.. సబ్జెక్ట్‌తోనే సభకు రావాలి

### ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



- ఎమ్మెల్యేల పనితీరుపై నిఘా..
- ప్రజలకు జవాబుదారీతనం ఉండాలి..
- మతసామరస్యం అవసరమన్న సీఎం

**ఏపీ బ్యూరో, దీక్షప్రభ:** వ్యక్తిగత కక్షల ప్రస్తావనకు అసెంబ్లీని వేదికగా మార్చవద్దని కూటమి ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. బుధవారం జరిగిన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సభకు పూర్తి స్థాయిలో సిద్ధమై సబ్జెక్ట్‌తోనే రావాలని స్పష్టం చేశారు. 20 నెలలుగా కూటమి నేతల మధ్య ఐక్యత కొనసాగుతోందని పేర్కొన్న సీఎం, ఇదే స్ఫూర్తి కింది స్థాయిలోనూ కనిపించాలని అన్నారు. జిల్లా స్థాయిలో మూడు పార్టీల నాయకులు తరచూ సమావేశాలు నిర్వహిస్తూ ఐక్యతను మరింత బలపర్చుకోవాలని సూచించారు.

**ఎమ్మెల్యేల పనితీరుపై నిఘా..**

అసెంబ్లీ

మిగతా2లో...

## అమెరికాకు దేశాన్ని అమ్మేశారు

- వాణిజ్య ఒప్పందం దేశానికే సిగ్గుచేటు
- చమురు అవసరాలను ఎక్కడి నుంచి తీర్చుకోవాలో అమెరికా నిర్ణయించే పరిస్థితి
- గతంలో ఏ ప్రధానమంత్రి కూడా దేశ సార్వభౌమత్వాన్ని ఇలా వేరే దేశం చేతుల్లో పెట్టలేదు
- ప్రధానిపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు






## గ్రూప్1 అక్రమాలపై హైకోర్టు ఉక్కుపాదం

- 'సిట్' విచారణకు సంచలన ఆదేశం!
- బయటపడనున్న మూల్యాంకన బాగోతం..
- రంగంలోకి అడిషనల్ డీజీ స్థాయి అధికారి!

**ఏపీ బ్యూరో, దీక్షప్రభ:** ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్ 1 ప్రధాన పరీక్షల వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. జవాబు పత్రాల మూల్యాంకనంలో భారీ అక్రమాలు జరిగాయని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన ధర్మాసనం, వాస్తవాలను వెలికితీయడానికి

మిగతా2లో...

## మూసీ భూసేకరణకు నోటిఫికేషన్

- భూములను సేకరించే ప్రక్రియఅధికారికంగా ప్రారంభం
- దశల వారీగా చేపట్టనున్న భూసేకరణ
- తొలుత రంగారెడ్డి జిల్లాలో సేకరణ



## ముక్కలైన భాగ్యనగరం

- మూడు కార్పొరేషన్లుగా హైదరాబాద్
- పూర్తయిన విభజన.. 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులు




**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** భాగ్యనగర పాలనలో కొత్త అధ్యాయం మొదలైంది. పెరుగుతున్న జనాభా, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు భాగాలుగా విభజిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది.

మిగతా2లో...

# గ్రూప్-1 అక్రమాలపై హైకోర్టు ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)
ప్రత్యేక దర్యాప్తు బృందాన్నిఏర్పాటు చేయాలని ఆదేశించింది. అడిషనల్ డీజీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఈ విచారణ అత్యంత పారదర్శకంగా జరగాలని కోర్టు స్పష్టం చేసింది.

**ఫోరెన్సిక్ నిపుణులతో 'ట్యాంపరింగ్' గుట్టురట్టు**
ఈ కేసులో ప్రధానంగా వినిపిస్తున్న 'జవాబు పత్రాల మార్పిడి' ఆరోపణలపై కోర్టు తీవ్రంగా స్పందించింది. ఎంపికైన అభ్యర్థుల పేపర్లు భద్రంగా ఉన్నాయా? లేదా వాటిలో ఏవైనా మార్పులు చేర్పులు జరిగాయా? అన్నది తేల్చడానికి రాష్ట్రం వెలుపల ఉన్న ఫోరెన్సిక్ నిపుణుల సేవలను ఉపయోగించుకోవాలని సూచించింది. విజయవాడలో జరిగిన మూల్యాంకన ప్రక్రియలో వాడిన బార్‌కోడ్‌లు, అసలు ఓఎంఆర్ షీట్లలోని డేటా సరిపోలుతున్నాయో లేదో శాస్త్రీయంగా తనిఖీ చేయాలని ఆదేశించి, అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది.

**ఉద్యోగులకు షాక్..**
దర్యాప్తు నిష్పాక్షికంగా సాగాలంటే, ప్రస్తుతం విధుల్లో ఉన్న ఎంపికైన అభ్యర్థులు అధికార యంత్రాంగాన్ని ప్రభావితం చేయకుండా చూడాలని కోర్టు భావించింది. ఈ క్రమంలో, గ్రూప్ 1 ద్వారా ఎంపికై ప్రస్తుతం వివిధ శాఖల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అభ్యర్థులందరినీ వెంటనే అప్రాధాన్య పోస్టులకు బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. విచారణ పూర్తయ్యే వరకు వారు దర్యాప్తును ప్రభావితం చేసే ఏ స్థానంలోనూ ఉండకూడదని కోర్టు తేల్చి చెప్పింది.

**మార్చి 16 గడువు..**
ఈ మొత్తం వ్యవహారంపై సిట్ తన సమగ్ర నివేదికను మార్చి 16వ తేదీలోగా సమర్పించాలని హైకోర్టు గడువు విధించింది. ప్రధాన వ్యాజ్యాలపై విచారణను కూడా అదే రోజుకు వాయిదా వేసింది. ఏళ్ల తరబడి కష్టపడి పరీక్షలు రాసిన తమకు, ఈ తీర్పుతో న్యాయం జరుగుతుందని వేలాది మంది నిరుద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వ్యవస్థలోని లోపాలను సరిదిద్దే దిశగా హైకోర్టు తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# మూసీ భూసేకరణకు నోటిఫికేషన్

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** మూసీ నదిని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు తెలంగాణ సర్కార్ నడుం బిగించింది. నది పరివాహక ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన భూములను సేకరించే ప్రక్రియను ప్రభుత్వం బుధవారం అధికారికంగా ప్రారంభించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న మూసీ పరివాహక ప్రాంతాన్ని సుందరీకరించడంతో పాటు, పర్యాటక కేంద్రంగా మార్చడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. మొత్తం 55 కిలోమీటర్ల మేర సాగే ఈ భారీ ప్రాజెక్టు కోసం దశలవారీగా భూసేకరణ చేపట్టనున్నారు.

**తొలి విడతగా 50 ఎకరాల సేకరణ...**
భూసేకరణ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం తొలి విడతగా రంగారెడ్డి జిల్లాలోని గోల్కొండ, గండిపేట మండలాలపై దృష్టి సారించింది. ఈ రెండు మండలాల పరిధిలో సుమారు 50 ఎకరాలకు పైగా భూమిని సేకరించాలని నిర్ణయించిన అధికారులు, దానికి సంబంధించిన సర్వే నంబర్లు, గ్రామాల జాబితాను నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. ఈ సేకరణ ప్రక్రియతో ప్రాజెక్టుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు మార్గం సుగమం కానుంది. భూములు కోల్పోతున్న రైతులు, యజమానులకు ఎటువంటి అన్యాయం జరగకుండా ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

**అభ్యంతరాలకు అవకాశం..**
నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో, భూసేకరణపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా సంబంధిత రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొత్తం 3 జిల్లాలు, 14 మండలాలు, 46 గ్రామాల పరిధిలో సాగే ఈ ఆపరేషన్ ముగిశాక, క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. అక్రమ కట్టడాల తొలగింపుతో పాటు, నది ఇరువైపులా పచ్చదనంతో నిండిన ఉద్యానవనాలు, వాకింగ్ ట్రాక్‌లు, సైక్లింగ్ జోన్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.

**ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా మూసీ**
మూసీ నదిని కేవలం శుద్ధి చేయడమే కాకుండా, నగర వాసులకు ఒక గొప్ప విడిది కేంద్రంగా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటక రంగానికి ఊతం లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తయితే, వచ్చే కొద్ది నెలల్లోనే మూసీ తీరం కొత్త రూపును సంతరించుకోనుంది.

# అమెరికాకు దేశాన్ని అమ్మేశారు

**నేషనల్ బ్యూరో, దీక్షప్రభ:** బడ్జెట్‌పై జరిగిన చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం దేశానికే సిగ్గుచేటని, భారత్ తన చమురు అవసరాలను ఎక్కడి నుంచి తీర్చుకోవాలో కూడా ఇప్పుడు అమెరికా నిర్ణయించే స్థాయికి పరిస్థితి దిగజారిందని ఆయన మండిపడ్డారు. గతంలో ఏ ప్రధానమంత్రి కూడా దేశ సార్వభౌమత్వాన్ని ఇలా వేరే దేశం చేతుల్లో పెట్టలేదని, ఇంధన రంగాన్ని అమెరికా ఒక ఆయుధంగా మార్చుకుని భారత్‌ను శాసిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సూపర్ పవర్ యుగం ముగిసినా, ప్రభుత్వం ఇంకా లొంగుబాటు ధోరణితోనే వ్యవహరిస్తోందని విమర్శించారు. డేటా భద్రత విషయంలో కూడా ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. భారతీయుల దగ్గర ఉన్న అపారమైన డేటాపై అమెరికా, చైనాలు కన్నేశాయని, మన ప్రజల ఆలోచనలను, ప్రతిభను పట్టుకోవడానికి అంతర్జాతీయ శక్తులు ప్రయత్నిస్తున్నాయని హెచ్చరించారు. దేశీయ వస్త్ర పరిశ్రమ పరిస్థితి దయనీయంగా మారిందని, బంగ్లాదేశ్ ఉత్పత్తులపై సున్నా సుంకం ఉండటంతో మన పరిశ్రమలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. అటు ట్రంప్ సుంకాలను పెంచుతుంటే, ఇటు మన ప్రభుత్వం మాత్రం అమెరికన్ ఎగుమతులను ప్రోత్సహిస్తూ మన ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తోందని విమర్శించారు. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి జరిగిన అన్యాయాన్ని ప్రస్తావిస్తూ రాహుల్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రైతులు స్తంభించిపోయారని, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటల మార్కెట్లను అమెరికాకు ధారాదత్తం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికన్ పొలాల యాంత్రీకరణకు మార్గం సుగమం చేస్తూ భారతీయ రైతుల పొట్ట కొట్టారని మండిపడ్డారు. "మీరు భారతదేశాన్ని అమ్మేశారు, భారత మాతను అమ్మడానికి మీకు సిగ్గుగా లేదా?" అంటూ ప్రధానిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అత్యవసర రంగాలకు కేటాయింపులు లేని ఈ బడ్జెట్ కేవలం విదేశీ శక్తులకు ఊడిగం చేసేలా ఉందని ఆయన దుయ్యబట్టారు.



# ముగిసిన తెలంగాణ మున్సిపల్ పోరు

(మొదటి పేజీ తరువాయి)
సమయం గడుస్తున్న కొద్దీ ఉద్రిక్తతలకు దారితీసింది. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మధ్య తలెత్తిన వాగ్వాదాలు, ఘర్షణలు చివరకు పోలీసుల జోక్యానికి దారితీశాయి. చాలా చోట్ల రాజకీయ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగడం, అధికారులపై ఒత్తిడి తీసుకురావడం వంటి ఘటనలు పోలింగ్ వాతావరణాన్ని వేడెక్కించాయి.
ఈ ఎన్నికల ప్రచార పర్వం నువ్వానేనా అన్నట్లుగా సాగింది. గెలుపు కోసం ప్రతి పార్టీ తమ సర్వశక్తులూ ఒడ్డి ప్రచారం నిర్వహించాయి. అభివృద్ధి హామీల కంటే ప్రత్యర్థులపై విమర్శలు, సవాళ్లు, వ్యక్తిగత ఆరోపణలే ఎక్కువగా వినిపించాయి. తిట్లపురాణం స్థాయికి చేరుకున్న ఈ రాజకీయ పోరులో ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపారనేది ఇప్పుడు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమై ఉంది. మొత్తం 116 మున్సిపాలిటీలలోని 2582 వార్డుల్లో 12 వార్డులు ఏకగ్రీవం కాగా, మిగిలిన 2569 వార్డుల్లో భారీ బందోబస్తు మధ్య పోలింగ్ జరిగింది. అదేవిధంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లలోని 414 వార్డులకు గాను 2 ఏకగ్రీవం కాగా, మిగిలిన 412 వార్డుల్లో ప్రజలు తమ తీర్పును నిక్షిప్తం చేశారు. ఈ నెల 13న ఓట్ల లెక్కింపు జరగనుండటంతో అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.




**కరీంనగర్ లో లాఠీచార్జి**
అన్ని ప్రాంతాల కంటే కరీంనగర్ జిల్లాలో చోటుచేసుకున్న పరిణామాలు రాష్ట్రస్థాయిలో సంచలనం సృష్టించాయి. కరీంనగర్‌లోని 58వ డివిజన్‌లో పరిస్థితులు ఒక్కసారిగా రణరంగాన్ని తలపించాయి. బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేయడం పెను దుమారానికి దారితీసింది. ఈ క్రమంలో బీజేపీ కార్యకర్తలకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. సుమారు ఆరుగురు కార్యకర్తల చేతులు విరిగిపోయినట్లు సమాచారం అందుతోంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యక్తిగత ఫోటోగ్రాఫర్ సైతం పోలీసుల లాఠీదెబ్బలకు గురికావడం గమనార్హం. బీఆర్ఎస్ నేతలు దొంగ ఓట్లు వేయిస్తుంటే, ఫిర్యాదు చేసిన తమపైనే పోలీసులు దాడికి పాల్పడ్డారని బీజేపీ శ్రేణులు జిల్లా పరిషత్ ముందు భారీ నిరసనకు దిగాయి. అదనపు బలగాలు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చినప్పటికీ, ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది.

**దొంగ ఓట్ల బాగోతం బట్టబయలు**
మరోవైపు కరీంనగర్ 34వ డివిజన్‌లోని హుస్సేనీపుర సూఫా కాన్వెంట్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్ల బాగోతం బట్టబయలైంది. ఒక స్వతంత్ర అభ్యర్థి తరపున దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నిస్తున్న ఎండి మొహీబుద్దీన్, ఎండి నజీబుద్దిన్ అనే యువకులను స్థానికులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న నకిలీ ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్న పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఎంఐఎం అభ్యర్థి మహమ్మద్ ఖాజా మజారుద్దీన్ స్పందిస్తూ, తనను రాజకీయంగా దెబ్బతీయడానికే ప్రత్యర్థులు ఈ రకమైన కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ అక్రమాల నేపథ్యంలో సదరు బూత్‌లో వెంటనే రీపోలింగ్ నిర్వహించాలని ఆయన ఎన్నికల అధికారులను కోరారు. దొంగ ఓట్ల వెనుక మాజీ రాజకీయ నేతల హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తం మీద, అనేక వివాదాలు, ఉత్కంఠ భరిత ఘట్టాల మధ్య ముగిసిన ఈ ఎన్నికల ఫలితం తెలంగాణ రాజకీయ దిశను ఎలా మారుస్తుందో చూడాలి.

# ముంబై పాలిటిక్స్‌లో చారిత్రాత్మక పరిణామం

- బీఎంసీ మేయర్‌గా రితూ తావ్డే
- గత 44 ఏళ్లలో బీజేపీకి చెందిన నాయకులు ఈ పదవిని చేపట్టడం ఇదే తొలిసారి




**నేషనల్ బ్యూరో, దీక్షప్రభ:** ముంబై రాజకీయాల్లో చారిత్రాత్మక మార్పు చోటుచేసుకుంది. బీజేపీ కార్పొరేటర్ రీతు తావ్డే బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 44 ఏళ్లలో బీజేపీకి చెందిన నాయకులు ఈ పదవిని చేపట్టడం ఇదే తొలిసారి కావడం విశేషం. దీంతో దాదాపు మూడు దశాబ్దాలుగా బీఎంసీపై శివసేన కొనసాగిస్తున్న ఆధిపత్యానికి ఈ ఎన్నికతో తెరపడింది. అయితే, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన , ఇతర ప్రతిపక్షాలు అభ్యర్థులను నిలబెట్టకపోవడంతో రీతు తావ్డే ఎన్నిక ఏకగ్రీవమైంది. మరాఠీ అస్తిత్వాన్ని గౌరవిస్తూ మహాయుతి కూటమికి ఉన్న మెజారిటీని దృష్టిలో ఉంచుకుని ప్రతిపక్షాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఈ సందర్భంగా రీతు తావ్డే మాట్లాడుతూ.. నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పౌరుల భద్రతకు తము అత్యంత ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. ముంబైకి తాను కేవలం మేయర్‌గా మాత్రమే కాకుండా ఒక సేవకురాలుగా పనిచేస్తానని రీతు తావ్డే అన్నారు. కాగా, 198283లో ప్రభాకర్ పాయ్ తర్వాత బీజేపీ నుంచి మేయర్ అయిన మొదటి వ్యక్తి రీతు తావ్డేనే. 2022 మార్చి నుంచి అడ్మినిస్ట్రేటర్ పాలనలో ఉన్న బీఎంసీకి ఇప్పుడు కొత్త నాయకత్వం లభించింది. ఘాట్‌కోపర్ ఈస్ట్ నుంచి రెండుసార్లు కార్పొరేటర్‌గా గెలిచిన రీతు తావ్డే, గతంలో బీఎంసీ విద్యా కమిటీ అధ్యక్షురాలిగా కూడా పనిచేశారు. అదేవిధంగా ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు చెందిన సంజయ్ ఘాడి డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. 227 సీట్లున్న బీఎంసీలో 89 సీట్లతో బీజేపీ అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. షిండే శివసేన 29 సీట్ల మద్దతుతో మహాయుతి కూటమి స్పష్టమైన మెజారిటీని సాధించింది.

# వ్యక్తిగత కక్షలు వద్దు.. సబ్జెక్ట్‌తోనే సభకు రావాలి

(మొదటి పేజీ తరువాయి)
సమావేశాల సమయంలో ఎమ్మెల్యేల పనితీరును సమీక్షిస్తానని చంద్రబాబు తెలిపారు. అవసరమైతే 40 మందిని వ్యక్తిగతంగా పిలిపించుకుని మాట్లాడతానన్నారు. సభలో ఆవు కథలు చెప్పడం మానేసి, సబ్జెక్ట్‌ను పూర్తిగా సిద్ధం చేసుకుని రావాలని ఆదేశించారు. ఎవరు ఏమి మాట్లాడుతున్నారో తాను నోట్ చేసుకుంటానని చెప్పారు. అసెంబ్లీ జరుగుతున్న రోజుల్లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సభ్యులంతా తప్పనిసరిగా సభలో ఉండాలని సూచించారు. తాను కూడా ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి సభ ముగిసే వరకు అసెంబ్లీలో ఉంటానని తెలిపారు.

**ప్రజలకు జవాబుదారీతనం ఉండాలి..**
సభలో మాట్లాడేది 5 కోట్ల మంది ప్రజల తరఫుననేనని గుర్తుపెట్టుకోవాలని ఎమ్మెల్యేలకు హితవు పలికారు. అనుకున్న అంశాన్ని 3 నుంచి 7 నిమిషాల్లో స్పష్టంగా వివరించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. రూ.లక్ష కోట్లకు పైగా హైవే పనులు, రూ.90 వేల కోట్లకు పైగా రైల్వే పనులు రాష్ట్రంలో కొనసాగుతున్నాయని తెలిపారు. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.450 కోట్ల నష్టాల్లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్, ప్రస్తుతం రూ.54 కోట్ల లాభాల్లోకి రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలను పూర్తిస్థాయిలో రాష్ట్రానికి తీసుకురావాలని సూచించారు.

**మతసామరస్యం అవసరం..**
అన్ని మతాలను గౌరవించాలని, భక్తుల సెంటిమెంట్‌ను దెబ్బతీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో మతాల పట్ల గౌరవం లేకపోవడం వల్లే రామతీర్థం సహా అనేక ఆలయాలపై దాడులు జరిగాయని విమర్శించారు. తిరుమల శ్రీవారి లడ్డూ సహా అనేక చోట్ల కల్తీకి పాల్పడ్డారని ఆరోపించారు.

# ముక్కలైన భాగ్యనగరం

(మొదటి పేజీ తరువాయి)
ఇకపై హైదరాబాద్ మహా నగరం జీహెచ్ఎంసీతో పాటు కొత్తగా ఏర్పడిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ , మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ల పరిధిలోకి రానుంది. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేస్తూ, కొత్త కార్పొరేషన్ల పరిధులు, జోన్లు, సర్కిళ్లతో కూడిన సమగ్ర మ్యాప్‌లను విడుదల చేసింది. కేవలం విభజనకే పరిమితం కాకుండా, ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేలా వార్డుల పునర్విభజనపై కూడా ప్రభుత్వం స్పష్టతనిచ్చింది.

**6 జోన్లు.. 30 సర్కిళ్లు!**
విభజన అనంతరం జీహెచ్ఎంసీని మొత్తం 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులుగా ఖరారు చేశారు. నగరంలోని ప్రధాన ప్రాంతాలను కలుపుతూ శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్‌లను జోన్లుగా నిర్ణయించారు. ఒక్కో జోన్ పరిధిలోకి వచ్చే సర్కిళ్ల వివరాలను ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. శంషాబాద్ జోన్ పరిధిలో ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి వంటి కీలక శివారు ప్రాంతాలను చేర్చగా, చార్మినార్ జోన్ కింద పాతబస్తీలోని సంతోష్ నగర్, యాకత్‌పురా, మలక్‌పేట, మూసారాంబాగ్‌లను ఉంచారు. రాజేంద్రనగర్ జోన్‌లో అత్తాపూర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట వంటి ప్రాంతాలు ఉండగా, గోల్కొండ జోన్ పరిధిలోకి గోషామహల్, కార్వాన్, మెహిదీపట్నం, మాసాబ్ ట్యాంక్ వంటి కీలక వ్యాపార కేంద్రాలు చేరాయి.

**ఐటీ కారిడార్..**

**మల్కాజ్‌గిరిలకు ప్రత్యేక గుర్తింపు**
ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఐటీ హబ్‌గా వెలుగొందుతున్న ప్రాంతాలన్నీ ఇకపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వెళ్లనున్నాయి. అటు నగరం యొక్క తూర్పు, ఉత్తర ప్రాంతాలను అనుసంధానిస్తూ మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు కావడంతో ఆయా ప్రాంతాల అభివృద్ధి వేగవంతం కానుంది. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని జూబ్లీహిల్స్, అమీర్‌పేట, బోరబండ వంటి ప్రాంతాలు, అలాగే సికింద్రాబాద్ జోన్ కింద ముషీరాబాద్, అంబర్‌పేట్, తార్నాక వంటి నివాస ప్రాంతాల పరిధిలపై ప్రభుత్వం మ్యాప్ ద్వారా స్పష్టమైన సరిహద్దులను గీసింది. పాలన వికేంద్రీకరణ ద్వారా నిధుల కేటాయింపు, మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

# రాష్ట్ర ఎన్నికల కమిషన్ అసలు ఉందా?



(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్ర ఎన్నికల కమిషన్ అసలు ఉందా? వాళ్లు రూపకల్పన చేసిన విధి విధానాలు అమలు చేస్తున్నారా? అనే అనుమానం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలపై భాజపా అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ ఎన్నికల కమిషన్, పోలీసుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ప్రభుత్వం జీహెచ్ఎంసీపై పెత్తనం చేస్తూ.. గ్రేటర్ పరిధిలో ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తోందని ఆరోపించారు. కేరళ ఎన్నికల కోసం ఆర్‌ఆర్ ట్యాక్స్ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడత పంపించిందని విమర్శించారు. మూసీ ప్రక్షాళన చేయాలని భాజపా కూడా కోరుకుంటోందన్నారు. మంచి పని చేస్తామంటే ఎవరూ వద్దంటారని.. చేతిలో చిల్లిగవ్వ లేకుండా ఎట్లా చేస్తారని ప్రశ్నించారు. డబ్బు, అధికార మదంతో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవాలని ప్రయత్నం చేసిందని దుయ్యబట్టారు. ఇంత పెద్దఎత్తున అధికార దుర్వినియోగం ఎప్పుడూ జరగలేదన్నారు. ఏ పార్టీ నుంచి గెలిచినా కాంగ్రెస్ పార్టీ బలపరిచే ఛైర్మన్‌కు మద్దతు ఇవ్వాలని ఇప్పటి నుంచే బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. విజయం సాధించిన ఏ ఒక్క భాజపా అభ్యర్థికి ఏదైనా జరిగితే రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

# యాదృచ్ఛికంగా జరిగాయా?

**ఢిల్లీ, దీక్షప్రభ:** తప్పిపోయిన పిల్లల కేసుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా చిన్నారుల అదృశ్యం ఘటనల వెనుక ఏదైనా నెట్‌వర్క్ హస్తం ఉందా? రాష్ట్రస్థాయిలో ఏవైనా ముఠాలు పనిచేస్తున్నాయా? అనేది గుర్తించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ ఘటనల వెనుక ఏదైనా వ్యవస్థీకృత ముఠా ఉందా?యాదృచ్ఛికంగా జరిగాయా? అనేది నిర్ధరించాలని సూచించింది. కిడ్నాపర్ల నుంచి రక్షించిన పిల్లలను ఇంటర్వ్యూ చేసి, వాటి వెనుక ఎటువంటి ముఠాలు ఉన్నాయో తెలుసుకోవాలని పేర్కొంది. ఈమేరకు అన్ని రాష్ట్రాల నుంచి డేటాను సేకరించాలని చెప్పింది. రాష్ట్రాల్లో పిల్లల మిస్సింగ్, అక్రమ రవాణాపై 'గురియా స్వయం సేవి సంస్థాన్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది.
కాగా కొన్ని రాష్ట్రాలు తప్పిపోయిన పిల్లల సమాచారం ఇస్తున్నాయని.. మరికొన్ని రాష్ట్రాలు మాత్రం ఈ డేటాను పంచుకోవడానికి నిరాకరిస్తున్నాయని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి న్యాయస్థానానికి తెలియజేశారు. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ.. అవసరమైతే సమాచారాన్ని అందించని రాష్ట్రాల విషయంలో కఠిన ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. ఈ విషయంలో కేంద్రానికి సహకరించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ సమాచారాన్ని సేకరించడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన అధికారిని నియమించాలని సూచించింది. అదృశ్యమైన పిల్లల కేసులను పర్యవేక్షించడానికి మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న పోర్టల్ (Online Portal) లో అన్ని రాష్ట్రాల మిస్సింగ్ వివరాలను అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించింది.

# 'మాకు కాదు.. ముందు మీరే నేర్చుకోండి'

(మొదటి పేజీ తరువాయి)
ఫిర్యాదులు అందాయి. వెంటనే అక్కడికి చేరుకున్న ఆయన, పోలీసుల తీరుపై నిప్పులు చెరిగారు. అక్కడే ఉన్న ఏసీపీని నిలదీస్తూ.. "కానిస్టేబుల్ తప్పు చేస్తే అది మీరు చేసినట్లే లెక్క" అని హెచ్చరించారు. "మాకు నేర్పించడం కాదు.. ముందు మీరే పద్ధతులు నేర్చుకోండి" అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అయ్యాయి. వినాయక్ నగర్ డివిజన్ కార్యకర్తల సమావేశంలో ఎంపీ అరవింద్ ప్రత్యర్థులపై ఫైర్ అయ్యారు. ఓట్ల కోసం కొందరు కుల రాజకీయాలు చేస్తున్నారని కార్యకర్తలు వివరించగా, ఆయన ఘాటుగా స్పందించారు. "కులాల పేరుతో విడగొట్టాలని చూస్తే ఒక్కటే అడగండి.. గతంలో కాశ్మీర్‌లో, ఇప్పుడు బంగ్లాదేశ్‌లో హిందువులను ఊచకోత కోసేటప్పుడు కులాలు చూశారా?" అని ప్రశ్నించారు. అక్కడ చంపింది హిందువులనే తప్ప కులాలను కాదని, ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.



## సీనియర్ జర్నలిస్ట్ సుందర్ రాజ్ మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్




రామచంద్రాపురం,దీక్ష ప్రభ: రామచంద్రాపురం మండలం ఆంధ్రజ్యోతి దిన పత్రిక సీనియర్ జర్నలిస్ట్ సుందర్ రాజ్ మరణం పట్ల పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత మూడు దశాబ్దాలుగా జర్నలిస్టుగా పని చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. నిబద్ధత కలిగిన జర్నలిస్టు సుందర్ మరణం పాత్రికేయ లోకానికి తీరని లోటని అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని మనసారా భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

## నూతన పెట్రోల్ పంప్ ప్రారంభించిన పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు మండలం జూటూరు గ్రామ పొలిమేరలో బాణకచెర్ల గ్రామానికి చెందిన రత్నమయ్య ఆహ్వానం మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, కన్వీనర్ రవీంద్రారెడ్డి, రాష్ట్ర యాదవ సంఘమ్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ హరినాథ్ రెడ్డి,వెంకటేశ్వర రావు, భాస్కర్ రెడ్డి,హరిప్రసాద్,సొసైటీ చైర్మన్ జనార్దన్ రెడ్డి,గోవిందు,లక్ష్మీకాంత్ రెడ్డి, రుద్రవరం సురేష్ కరీం బాష,నారపరెడ్డి, పూసల కృష్ణ, ఆఫీజ్, మధు ,నాగలక్ష్మి రెడ్డి, కన్వీనర్ జి మోహన్ రెడ్డి, క్లస్టర్ గిరిశ్వర్ రెడ్డి, రవికాంత్, మూర్తుజావాలి, జాకీర్ హుసైన్,జమీల్,టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.






## ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో మహిళలకు

# ఎంతో లాభదాయకం

**డ్వాక్రా రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి**

- రుణాలు తిరిగి చెల్లించే సమయంలోనూ బాధ్యతగా వ్యవహరించాలి
- సకాలంలో రుణాలు చెల్లిస్తే మరిన్ని రుణాలు పొందే అవకాశాలు ఉంటాయి
- భాకర్ ఫారం సర్పంచ్ కనకమేడల శ్రీనివాసరావు

**పోతంగల్,దీక్ష ప్రభ:** డ్వాక్రా మహిళల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు మహిళలు శ్రద్ధ చూపాలని బాకర్ ఫారం గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు సూచించారు. డ్వాక్రా మహిళలకు బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాలపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక గ్రామపంచాయతీలో బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ..డ్వాక్రా మహిళలకు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ఎంతో శ్రద్ధ చూపుతున్నాయని డాక్రా మహిళలు ప్రవేట్ ఫైనాన్స్ లను ఆశ్రయించి నష్టపోకూడదని అన్నారు. పోతంగల్ మండలం, బాకర్ ఫారం డ్వాక్రా సంఘ భవనంలో మహిళలతో ప్రత్యేక సమావేశాన్ని ఏపీఎం భాస్కర్ నిర్వహించారని. 15 గ్రూపులకు చెందిన మహిళలకు ఇప్పటికే 76 లక్షల రూపాయల రుణాలను అందించమని, మరో 20 లక్షల రూపాయలు రుణాలు ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నామని, రుణాలు తీసుకున్న వారు సద్వినియోగం చేసుకొని తిరిగి రుణాలు చెల్లింపులోనూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. శ్రీనిధి నుండి వడ్డీ లేని రుణాలను 7.5 లక్షల రూపాయలు మహిళలకు అందించామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి 40,000 చొప్పున ఆరు శాతం వడ్డీతో రుణాలు అందించే వీలుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని అత్యధిక లాభాలను గడించే వీలుంటుంది అన్నారు. మహిళలు తయారు చేసే ఆహార పదార్థాలు అమ్ముకునేందుకు నిజామాబాద్ లాంటి పట్టణాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పీఎంఎఫ్ఈఎంఈ పథకంలో మహిళలకు పరిశ్రమలను ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు అందించే వీలుందని 35% సబ్సిడీ తో రుణాలు పొందవచ్చని ఏపిఎం భాస్కర్ మహిళలకు వివరించారు. గ్రామ సంఘములో సైతం 11 లక్షల రూపాయలు ఉన్నాయని అవసరమైన మహిళలకు రుణాలు కూడా అందిస్తున్నట్లు వివోఏ రమేష్ తెలిపారు. తమ గ్రామంలోని డాక్రా మహిళలు ప్రతి ఒక్కరు చైతన్యవంతులని రుణాల విషయంలో ఎటువంటి అనుమానాలు లేకుండా మహిళలకు మరిన్ని రుణాలను అందించి మహిళా సంఘాలను అభివృద్ధి బాటలో నడిపించాలని గ్రామ సర్పంచ్ కనకమేడల శ్రీనివాసరావు కోరారు. రుణాల చెల్లింపులను పూర్తిస్థాయిలో మహిళలు చెల్లించే విధంగా తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిసి రమేష్, శ్రీనిధి మేనేజర్ సుభాష్, మహిళా సంఘం అధ్యక్షురాలు సుజాత, అంగన్వాడి టీచర్, తరంగిణి, విమల, శకుంతల, లక్ష్మీబాయి, మంజుల, విజయలక్ష్మి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



## ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ సమ్మెకు సంఘీభావం

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** ఏపీ ఎన్జీవోస్ నందికొట్కూరు తాలూకా అధ్యక్షులు ఏ రాముడు, కార్యదర్శి ఎన్ సత్యనారాయణ, మీడియా ప్రకటన ద్వారా తెలియజేస్తూ జాతీయ సార్వాత్రిక సమ్మెకు సంఘీభావంగ ఫిబ్రవరి 12, 2026న జాతీయ సార్వత్రిక సమ్మెకు సంఘీభావం తెలియజేస్తూ, నంద్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్నం 1.00 గంటల నుండి 2.00 గంటల వరకు భోజన విరామ సమయ ప్రదర్శనలు నిర్వహించబడును,ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయండి అని ఏపీ ఎన్జీవోస్ నందికొట్కూర్ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు రాముడు, సత్యనారాయణ పిలుపునిచ్చారు. వారిడిమాండ్లు తెలియజేస్తూకార్మిక చట్టాల రద్దు,వేతన సవరణ,పిఫ్.ఆర్.డి ఎ చట్టం రద్దు,పెండింగ్ బకాయిల చెల్లింపు,కాంట్రాక్ట్ ఉద్యోగుల నియమితీకరణ,పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ అమలు,పీఎస్యూలు మరియు సొసైటీలకు 62 ఏళ్ల పదవీ విరమణ,సీపీస్ ఉద్యోగుల కోసం మెమో-57 అమలు చేయాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలోఅధ్యక్షులు రాజశేఖర్ ఉపాధ్యక్షులు చెంచన్న,జాయింట్ సెక్రెటరీ ప్రవీణ్ ఉమెన్స్ జాయింట్ సెక్రెటరీ వెంకట్ లత, ఏ.రాముడు, అధ్యక్షులు ఎన్.సత్యనారాయణ, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.





## శ్రీశైలానికి వచ్చే భక్తులకు మెరుగైన ఏర్పాట్లు

- దర్శనానికి వచ్చే భక్తులు సంయమనం పాటించాలి
- జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా

**శ్రీశైలం/నంద్యాల,దీక్ష ప్రభ:** శ్రీశైల బ్రహ్మోత్సవాల సందర్భంగా క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం పూర్తిస్థాయి ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం శ్రీశైలం కమాండ్ కంట్రోల్ రూంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్‌తో కలిసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల దృష్ట్యా జిల్లా యంత్రాంగం సమన్వయంతో దేవాదాయ,అటవీ,పోలీసు,రెవెన్యూ తదితర శాఖలు సమగ్ర చర్యలు చేపట్టాయని తెలిపారు.ఈ ఏడాది కాలినడకన వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. నిన్న ఒక్కరోజే స్వామి, అమ్మవార్లను సుమారు 71 వేల మంది భక్తులు దర్శించుకున్నారని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం స్పర్శ దర్శనం, అలంకార దర్శనం కోసం వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్పర్శ దర్శనానికి కొంత సమయం ఎక్కువగా, అలంకార దర్శనం తక్కువ సమయంలో పూర్తవుతుందని చెప్పారు. అధిక రద్దీ కారణంగా దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టే అవకాశం ఉన్నందున భక్తులు సహనంతో వ్యవహరించాలని సూచించారు.శ్రీశైలం క్షేత్రానికి వచ్చే ప్రతి భక్తుడు ఆధ్యాత్మిక భావనతో దర్శనానికి వస్తారని, అదే భక్తి భావాన్ని దర్శనం పూర్తయ్యే వరకు కొనసాగించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అలాగే క్షేత్ర పరిశుభ్రతను కాపాడేందుకు భక్తులు ఉపయోగించిన ఆహార పదార్థాల అవశేషాలు, ప్లాస్టిక్ వస్తువులను తప్పనిసరిగా డస్ట్ బిన్స్‌లో వేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల సహకారంతో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. రవాణా సౌకర్యం కోసం అదనంగా 460 బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు.జిల్లాలోని ఇతర శైవ క్షేత్రాల్లో కూడా ఇదే తరహా ఏర్పాట్లు చేపట్టామని, మహానంది క్షేత్రంలో శివరాత్రి సందర్భంగా సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.





- ముని్సపల్ ఎన్నికల్లో భారీగా పొలైన ఓట్లు
- ఇస్నాపూర్ లో 80.55
- ఇంద్రేశంలో 84.84

# పోటెత్తిన ఓటర్లు

**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు ఓటు వేసేందుకు ఉత్సాహం చూపారు. ఇందుకు పొలైన ఓట్ల శాతం చుస్తే తెలుస్తోంది. ఉదయం 7 గంటల నుంచే ఓటు హక్కు వినియోగించేందు కునేందుకు ఉత్సాహం చూపారు. వివిధ పార్టీల నాయకులు ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చి వెళ్ళారు. పటాన్ చెరు మండలం ఇంద్రేశం పోలింగ్ కేంద్రం ఉన్న యూపీఎస్ స్కూల్ వద్ద 6వ వార్డు నుంచి పోటీలో ఉన్న బండి హరి శంకర్ ముదిరాజ్ తో కొద్ది సేపు పోలీసులు వాగ్వాదం చేశారు. వికలాంగ ఓటర్ల ను ఆయన దగ్గరుండి పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకు వెళుతుండటంతో పోలీసులు అభ్యంతరం తెలిపారు. దీంతో కొద్ది సేపు పోలీసులతో వాగ్వాదం జరిగింది. మొత్తం మీద పోలింగ్ అన్ని కేంద్రాలలో ప్రశాంతంగా ముగిసింది. సైబరాబాద్ డిఎస్పీ ఉదయ్ కుమార్ బచ్చుగూడా పోలింగ్ కేంద్రం సందర్శించారు. అక్కడే విధి నిర్వహణలో ఉన్న పటాన్ చెరు ఎస్ఐ విద్యా చరణ్ రెడ్డి కి తగు సూచనలు చేశారు. మండలం లోని ఇంద్రేశం మున్సిపల్ ఎన్నికల్లో 80.55 ఓట్లు పోలవ్వగా,ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 84.84 ఓట్లు పొలయ్యాయి.



## డాక్టర్ శ్రీలీలగా టాలీవుడ్ సెన్సేషన్

ఎంబీబీఎస్ పట్టా సాధించిన స్టార్ హీరోయిన్ టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల తన అందం, అభినయం, అద్భుతమైన డ్యాన్స్‌తో ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు ఆమె మరో ఘనత సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. వెండితెరపై వరుస సినిమాలతో బిజీగా ఉంటూనే, మెడిసిన్ విద్యను విజయవంతంగా పూర్తి చేసి ఎంబీబీఎస్ పట్టా అందుకుంది. సినిమా షూటింగ్‌లు, ప్రాక్టీస్‌లు, ప్రమోషన్లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ చదువును ఎక్కడా నిర్లక్ష్యం చేయకుండా శ్రీలీల తన లక్ష్యాన్ని చేరుకోవడం ప్రశంసనీయం. తాజాగా ఆమె గ్రాడ్యుయేషన్ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. డాక్టర్ పట్టా అందుకుంటున్న ఆమె దృశ్యాలు అభిమానులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ఈ విషయం తెలిసిన అభిమానులు, సినీ ప్రముఖులు శ్రీలీలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. “సినిమాల్లో స్టార్‌గా కొనసాగుతూనే విద్యను పూర్తి చేయడం గొప్ప విషయం” అంటూ ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇటు సినిమాల్లో వరుస అవకాశాలు, అటు విద్యలో విజయంతో శ్రీలీల ఇప్పుడు యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

Printed,Published,Edited, & owned by **Rathod Vinod Kumar** Published from **SNEHITHA PUBLICATIONS** Falcon Printing press, # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code :502220, Printed At Falcon Printing Press # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code: 502220, Editor: **Rathod Vinod Kumar**. RNI NO. TELTEL/2023/87655,Cell : 9550021491,7893532721, Gmail: deekshaprabhatelugudaily@gmail.com